క్లుప్తంగా

నిరుపయోగంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం



మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఇటీవల సీఎం కేసీఆర్ సమీకృత జిల్లా కార్యాలయం ప్రారంభించారు. ఈక్రమంలో జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం సమీపంలో జిల్లా విద్యా శాఖ కార్యాలయంను సమీకృత జిల్లా కార్యాలయానికి మార్చారు. అప్పటి నుంచి ఈ కార్యాలయం నిరుపయోగంగా మారింది. అయితే ఈ భవనాన్ని మండల విద్యా వనరుల (ఎంఈఓ) కార్యాలయానికి అప్పగించాలని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించాలి



దంతాలపల్లి: మండలంలోని రామవరం, తూర్పుతండా గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు రోజులు గడుస్తున్నా.. ఇంతవరకు సంబంధిత అధికారులు ఎవ్వరు కూడా పరిశీలించలేదని మాజీ సర్పంచ్ దిడ్డి వెంకన్న, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, కలెక్టర్ ఇచ్చిన సూచనలను అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సర్పంచ్ చెబితే నష్టపోయిన పంటలను పరిశీలిస్తామనడం సరికాదన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి పంట నష్టం అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు.

సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠాపన



పెద్దవంగర: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ వేడుకలు బుధవారం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ఇంటి ముందు మామిడి తోరణాలతో అలంకరించి పండుగకు స్వాగతం పలికారు. ఉగాది పచ్చడి చేసుకొని ఆనందోత్సవాల మధ్య పండగా వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం పంచాంగ పఠనం చేశారు. అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం బొమ్మకల్లు గ్రామంలో శ్రీ అంజనేయస్వామి ఆలయంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉగాది రోజు ప్రతిష్ఠించిన విగ్రహాలకు శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా కల్యాణం నిర్వహించడం గ్రామస్తుల ఆచారం. శుభకృత్ నామ సంవత్సరంలో పాడి పంటలతో పచ్చటి పొలాలతో సస్యశ్యామలంగా విరాజిల్లుతుందని పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్య శర్మ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పోడిశెట్టి వెంకటనారాయణ, రంగు శ్రీనివాస్, రాములు, రామ్మూర్తి, తదితరుల ఉన్నారు.

ఘనంగా భోగ్ భండారో పూజలు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని బాబునాయక్ తండాలో ఉగాది పండుగ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట భోగ్ భండారో పూజలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమ తాత ముత్తాతల కలం నుంచి నుంచి వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తూ ఉగాది పండుగ రోజున భోగ్ బండారో పూజలు నిర్వహిస్తున్నామని తండావాసులు తెలిపారు.

బలగం సినిమాను ప్రతి ఒక్కరూ వీక్షించాలి

ఎమ్మెల్సీ రవీందర్‌రావు



మహబూబాబాద్ అర్బన్: బలగం సినిమాని ఇంట్లో సభ్యులంతా కలిసి వీక్షించాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీథియేటర్‌లో బుధవారం బలగం సినిమాను రవీందర్ రావు కుటుంబ సభ్యులు, అమ్మ అనాథ ఆశ్రమం పిల్లలతో కలిసి వీక్షించారు.

భక్తి ప్రపత్తులతో ఉగాది వేడుకలు

జిల్లా వ్యాప్తంగా శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు బుధవారం ప్రజలంతా ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లల్లో గుమ్మాలకు మామిడి తోరణాలు, పలు రకాల పూల దండలతో అలంకరించారు. ఇంటిల్లిపాదిగా దేవుడి వద్ద ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులంతా కలిసి ఉగాది పచ్చడను ఆరగించారు. సాయంత్రం ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు సిరులు కురిపిస్తాయని, అన్ని రంగాల ప్రజలకు ఆదాయ వనరులు సమృద్ధిగా లభిస్తాయని, అర్చకులు పంచాంగ శ్రవణంను క్షుణ్ణంగా ప్రజలకు వివరించారు. మహబూబాబాద్‌లో శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం, శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బ్రాహ్మణోత్తములు బ్రహ్మశ్రీ తాటిపాముల నరసింహమూర్తి, అర్చకులు కాయితోజు పరిపూర్ణాచార్యులు మాట్లాడారు. రాబోయే ఏడాది కాలంలో జరుగనున్న శుభ, అశుభ ఫలితాలు, వాటి పరిహార మార్గాలపై వారు భక్తులకు వివరించారు.

\- సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్: కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, రచయితలు



మహబూబాబాద్ అర్బన్: మైనార్టీ కళాశాలలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్



మహబూబాబాద్ రూరల్: వేణుగోపాల స్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం..



కేసముద్రం: ఇనుగుర్తిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో..



నెహ్రూసెంటర్: ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఆర్టీసీ డీఎం విజయ్



నెల్లికుదురు: బ్రాహ్మణకొత్తపల్లి ఆలయంలో పంచాగ శ్రవణం..



మహబూబాబాద్: వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో..



కురవి: పిల్లలకు అరటిపండ్లు అందజేసిన నిర్వాహకులు



తొర్రూరు: కస్తూర్బాలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు



కురవి: వీరభద్రస్వామి ఆలయంలో..



గూడూరు: లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో..



బయ్యారంలో పంచాంగ శ్రవణం..



దోర్నకల్: వేంకటేశ్వరాలయంలో..



గార్ల: లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో..



కేసముద్రం: అమీనాపురంలో గుడి వద్ద పూజలు



తొర్రూరు రూరల్: గుర్తూరులో..

సీతారాముల కల్యాణ మహోత్సవం



సీతారాములను ఊరేగిస్తున్న కమిటీ బాధ్యులు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవాలయంలో కొలువై ఉన్న సీతారామచంద్రస్వామివారి 65వ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీసీతారామ కల్యాణోత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ భువనగిరి అనిల్‌గుప్త, కార్యదర్శి మాలె నాగేశ్వర్ రావు, కోశాధికారి నాయిని రంజిత్, భక్తులు రాములోరికి పూజలు నిర్వహించి, రథం లాగి ఊరేగింపు ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ ముఖ్య సలహాదారులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, గద్దె రవి, ఓం నారాయణలోయ, మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ బోనగిరి గోపిరత్నం గంగధర్‌నాథ్, సభ్యులు గుండా రాజశేఖర్, ఎండి ఫరీద్, యాళ్ల మురళీధర్‌రెడ్డి, మాలె శ్రవణ్‌కుమార్, వేమిశెట్టి చంద్రయ్య, చిట్యాల జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడలను ప్రారంభిస్తున్న డీఎస్ రవిచంద్ర

మరిపెడ రూరల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీఎస్ రవిచంద్ర అన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని మరిపెడ మండలం ఎల్లంపేటలో గ్రామ స్థాయి క్రికెట్ క్రీడలను రవిచంద్ర బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ.. యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ రఘురాములు, నాయకులు గండి పుల్లయ్య, పరమేశ్వర్, గండి భార్గవ్, అంబరీష, క్రీడాకారులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న అరెస్ట్ అప్రజాస్వామికం



బయ్యారం: నిరసన తెలుపుతున్న నాయకులు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచందర్‌రావు

మహబూబాబాద్ అర్బన్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఆగడాలను బయటపెడుతున్నాడని తీన్మార్ మల్లన్నపై కుట్రతో అక్రమ అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామచందర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం క్యూ న్యూస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న కొన్ని నెలలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అరాచక పరిపాలనను వెలికితీస్తున్నందుకు, మల్లన్నను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. కవిత లిక్కర్ స్కాంపై, గ్రూప్-1 పేపర్ లీకేజీపై కథనాలు రాస్తూ అవినీతిని బయటపెడుతున్నాడని అరెస్ట్ చేశారన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు విఠల్ అరెస్టను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి శ్యామ్ సందర్ శర్మ, అసెంబ్లీ కన్వీనర్ మోసంగి మురళి, పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లె సందీప్ గౌడ్, మల్లన్న టీం సభ్యులు దాసరి భాస్కర్, రాజేష్, సాయి కుమార్, జనార్ధన్, గోవర్ధన్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: నిరసన తెలుపుతున్న నాయకులు

బయ్యారంలో..

బయ్యారం: తీన్మార్ మల్లన్నను పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని బయ్యారంలో పలు పార్టీలు, కులసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.

మల్లన్న అక్రమ అరెస్టును ఖండించండి

నెహ్రూసెంటర్: తెలంగాణ ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న తీన్మార్ మల్లను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఎల్‌హెచ్‌పీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ గుగులోత్ భీమానాయక్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రభుత్వం మల్లన్నను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక పూజలు

మహబూబాబాద్ రూరల్: ఉగాది పండుగ సందర్భంగా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామంలో గల శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. స్వయంభువుగా వెలిసిన పాతాళ నాగదేవత అమ్మవారు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి భక్తులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాంశెట్టి వీరేందర్, ప్రధాన కార్యదర్శి పద్మం ఉపేంద్రమ్మ, కోశాధికారి చిట్టిమల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పద్మం భిక్షపతి, ఉప కోశాధికారి గంగాదహరి యమున, కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు బొల్లోజు శ్రీనివాసాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలు అమలు చేయడంలో విఫలమైందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఈనెల 25నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు నిర్వహించే సీపీఐ ప్రజా పోరుయాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు తెలంగాణకు తీసుకురావాల్సిన హామీలను తీసుకురాకుండా భరోసా యాత్రల పేరుతో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ ప్రజలను రెచ్చగొడుతూ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పి, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని కాలయాపన చేస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే రానున్న రోజుల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు మియాపురం గోవర్ధన్, సీపీఐ నర్సంపేట మండల కార్యదర్శి గడ్డం యాకయ్య, నాయకులు గడ్డం నాగరాజు, సురేష్, మేడి రంజిత్, పాలక మహేష్, ఎండి.పర్వీన, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

26న ఆలయ వార్షికోత్సవం



కరపత్రాలు అవిష్కరిస్తున్న గ్రామస్తులు

గూడూరు: పాకాలవాగు ఒడ్డున నిర్మించిన బద్దిపోచమ్మ దేవాలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని సనాతన శివాలయ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో బుధవారం ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారులు భానుప్రకాశ్‌శాస్త్రి, సతీష్‌పాండ్యేలతో మాట్లాడారు. ఈనెల 26వ తేదీ ఆదివారం రోజు ఉదయం 6 గంటలకు బద్దిపోచమ్మ ఆలయ ప్రాంగణంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ ప్రజ్వలన, అంకురార్పణ, 10గంటలకు గ్రామదేవత పోచమ్మ విగ్రహానికి పంచామృత అభిషేకాలతో పాటు ప్రతీ ఇంటి నుంచి గ్రామస్తులు తీసుకొచ్చిన బిందెడు నీటితో జలాభిషేకం, మధ్యాహ్నం 12గంటలకు అమ్మవారికి బోనాల సమర్పణ, నైవేద్యం. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో శివాలయ, పోచమ్మ దేవాలయ కమిటీ సభ్యులు శ్రీపాల్‌రెడ్డి, శివ, సాగర్, మల్లేష్‌యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా కొండలమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే హరిప్రియ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఆదాయ పన్ను శాఖ కమిషనర్ జీవన్‌లాల్

గార్ల: మండల పరిధిలోని పినిరెడ్డిగూడెం గ్రామ సమీపంలోని కొండలమ్మ దేవాలయంలో బుధవారం వందలాది మంది భక్తులు దేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి పారవశ్యం పొందారు. ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రజాప్రతినిధులతో కలిసి కొండలమ్మ దేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీఏటా ఉగాది పర్వదినం రోజు కొండలమ్మ జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కొంగు బంగారం, కోరుకున్న కోర్కెలను తీర్చే కొండలమ్మ దేవతకు భక్తులు ప్రభబండ్లు కట్టి దేవాలమం చుట్టూ ప్రదర్శనలు చేసి జంతుబలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొండలమ్మ దేవతను దర్శించుకునేందుకు దేవాలయం ఎదుట భక్తుల సౌకర్యార్థం క్యూ కోసం బారికేడ్లు నిర్మించారు. జాతర సందర్భంగా దేవాలయం ప్రాంగణంలో రకరకాల ఆట వస్తువుల దుకాణాలు వెలిశాయి. ఈ జాతరకు గార్ల మండలంతో పాటు, బయ్యారం, కారేపల్లి, డోర్నకల్ మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో రావడంతో దేవాలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు చోటుచేసుకోకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై బానోత్ వెంకన్న పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఆదాయ పన్ను శాఖ కమిషనర్ లావుడియా జీవన్‌లాల్ కొండలమ్మ దేవతను దర్శించుకున్నారు. ఆయన వెంట సీఐ కాశీరాం, ఎస్సైలు బానోత్ వెంకన్న, బాదావత్ రవి, రాజ్‌కుమార్ జాదవ్, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

బొడ్రాయి వేడుకల ఆహ్వాన పత్రాల ఆవిష్కరణ



కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామంలో వచ్చే మే నెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన సందర్భంగా ఆహ్వాన కరపత్రాలను బుధవారం శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో గ్రామస్తులు ఆవిష్కరించారు. ముందుగా శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆహ్వాన కరపత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పంచాగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలం యాకయ్య, మాజీ సర్పంచ్ రావుల మల్లేశం, కూరెల్లి సతీష్, మద్దెల బిక్షపతి, గడ్డం యాకమూర్తి, పూజారి కొమురయ్య, నీలం వెంకన్న, చిర్రగోని యాకమూర్తి, ఆరెందుల మహేశ్వరాచారి, రణధీర్, శ్రీను పాల్గొన్నారు.